

సింపోజియంలో 'మిట్స్' విద్యార్థుల ప్రతిభ


బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లె : మిట్స్ కళాశాలలో బీ.టెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ డేటా సైన్స్ మూడవ సంవత్సరం చదువుతున్న ఎస్.గౌతమి, ఎస్.బి.నీలవేణి, రెండవ సంవత్సరం చదువుతున్న పి.మనోజ్ కుమార్, వి.సయ్యద్ నౌషాద్ ప్రాజెక్ట్ ఎక్స్‌పో పోటీలో బహుమతులు పొందినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. కడపలోని అన్నమా చార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ వారు నిర్వహించిన జాతీయ స్థాయి విద్యార్థుల సాంకేతిక సింపోజియం-2కె25లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శనను కనపరచినట్లు చెప్పారు. తమ విద్యార్థులను కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, విభాగాధిపతి డాక్టర్ కుసుమ అభినందనలు తెలియజేసారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-చిన్నమండెం

ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిస్తూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళుతుందని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో మంత్రి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అధికారులు, ప్రజా ప్రతినిధులు నిరంతరం ప్రజాసేవకే అంకితమై ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడం జరుగుతుం దని పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వల్ల ప్రజలు పలు సమస్యలతో నానా ఇబ్బందులు ఎదుర్కొనే వారిని ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి నియోజక వర్గంలో ఆయా ఎమ్మెల్యేలు, మంత్రుల సమక్షంలో ప్రజాదర్బార్ కార్యక్రమాలు నిర్వహించి ప్రజల సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. రాబోయే రోజులలో సమస్యల రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. మంత్రి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కొన్ని సమస్యలను సంబంధిత అధికారులకు ఫోన్ చేసి అక్కడికక్కడే పరిష్కరించారు.


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

చౌడేశ్వరిదేవి విగ్రహావిష్కరణలో మంత్రి

రాయచోటి: మండల పరిధిలోని తొగటపల్లెలో నూతనంగా నిర్మించిన చౌడేశ్వరి దేవి గుడిలో శుక్రవారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చౌడేశ్వరి దేవి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తొకటపల్లి గ్రామ ప్రజలు గజమాలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు. కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు శక్తి యాప్ రక్షణ కవచం : ఎస్‌పి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

ప్రతి ఒక్క మహిళ మొబైల్‌లో శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఆపద సమయంలో పోలీసు వారి తక్షణ సహాయం పొందగలరని ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడు అన్నారు. శుక్రవారం ఆయన శక్తి యాప్ గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళలు, బాలికల భద్రత కొరకు శక్తి యాప్‌ను ప్రవేశపెట్టిందని, ఈయాప్ ప్రధానంగా మహిళలపై జరిగే వేధింపులు, అత్యాచారాలు, ఇతర హింసాత్మక సంఘటనలను నివారించటానికి ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. జిల్లాలో ప్రతి ఒక్క మహిళ, గృహిణులు విద్యార్థులు, బాలికలు వారి యొక్క మొబైల్‌లో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఆపద సమయంలో పోలీసు వారి తక్షణ సహాయం, సహకారం పొందాలని పేర్కొన్నారు. ఆపదలో ఉన్న మహిళలు ఎవరైనా ఎస్‌ఒఎస్ బటన్ ప్రెస్ చేస్తే వారు ఉన్న ప్రాంతం వివరాలు దగ్గర్లో ఉన్న పోలీసుస్టేషన్‌కు, డయల్ 112 నెంబర్‌కు చేరుతుందని వెంటనే పోలీసులు అప్రమత్తమై సంఘటన స్థలానికి చేరుకొని వారికి రక్షణ కల్పించే విధంగా చర్యలు చేపట్టడతామని తెలిపారు. మహిళలు, బాలికలు, విద్యార్థినులు, ఉద్యోగినులు, గృహిణులు అత్యవసర పరిస్థితుల్లో రక్షణ అవసరమైన వారు శక్తి యాప్ ద్వారా మరింత భద్రంగా ఉండగలరని పేర్కొన్నారు. అత్యవసర సమయంలో పోలీస్ వారి యొక్క సహాయాన్ని పొందగలరని తెలిపారు.న మహిళలు, చిన్నారులు తమకు ఎదురయ్యే వివిధ ఫిర్యాదులు, ఇబ్బందులపై పోలీసు వారి సహాయం కొరకు శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ప్రతి ఒక్క మహిళ, విద్యార్థినులు, బాలికలు, ఉద్యోగినులు, గృహిణులు తమ మొబైల్ లో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.


మాట్లాడుతున్న ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు

ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం


చైత్రకు బంగారు పతకం ప్రదానం చేస్తున్న హెచ్‌ఎం ఫౌజియాబేగం

ప్రజాశక్తి-పీలేరు

తమ పాఠశాలలో చదివే విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడం ఉపాధ్యాయులుగా మా కర్తవ్యమని ప్రధానోపాధ్యాయులు ఫౌజియా బేగం తెలిపారు. శుక్రవారం పీలేరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు, వార్షికోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ 60 వసంతాలు పూర్తి చేసుకున్న జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల 1964లో ప్రారంభించారన్నారు. ఈ విద్యాసంస్థలో ఉపాధ్యాయులు విద్యార్థినులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, వారి భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తోందని పేర్కొన్నారు. పాఠశాల ప్రప్రథమ ప్రధానోపాధ్యాయినిగా పనిచేసిన ఆర్. పద్మావతమ్మ 23 ఏళ్ళ పాటు పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని తెలిపారు. తాను ఉద్యోగ విరమణ పొందినప్పటికీ, ప్రతి ప్రతి సంవత్సరం 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రథమ స్థానం మార్కులు సాధించిన విద్యార్థినికి బంగారు పతకంతో సత్కరించే సాంప్రదాయానికి తెర తీసి విద్యాసంస్థ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలియజేశారు. 2023-24 విద్యా సంవత్సరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించి 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన వేపుల బైలు పంచాయతీ, గాజులవారిపల్లెకు చెందిన కావలి సౌందర్య, రామ్మోహన్ దంపతుల కుమార్తె కావలి చైత్రకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫౌజియా బేగం, ఉపాధ్యాయులు బంగారు పతకం ప్రదానం చేశారు. తమ కుమార్తె ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తూ బంగారు పతకం ప్రకటించిన విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయులు ఆర్.పద్మావతమ్మకు, ప్రస్తుత హెచ్‌ఎం ఫౌజియా బేగం, ఉపాధ్యాయ బృందానికి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల బోధనా సిబ్బంది మాట్లాడుతూ ప్రతిభ గల విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించడం తమ బాధ్యతని తెలిపారు. కావలి చైత్ర లాంటి మరెందరో ఉత్తమ విద్యార్థుల భవిష్యత్తును సాధించాలనే ఆశయంతో పాఠశాల విద్యను మరింత మెరుగుపరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుల ఫౌజియా బేగం, సీనియర్ ఉపాధ్యాయినులు వై.విజయ కుమారి, జానం సుజాత, ఇతర ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.


చిల్లింగ్ సెంటర్‌లో విద్యార్థులు

పాల ఉత్పత్తులపై విద్యార్థులకు అవగాహన


ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తిరుపతి శ్రీజ కంపెనీ, జైకా సంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులకు పాలు, పాల ఉత్పత్తుల వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వ హించారు. శుక్రవారం సిటియం చిల్లింగ్ సెంటరును పీపుల్ ట్రీ స్కూల్ మదనపల్లి విద్యార్థులు సందర్శించారు.అలాగే పిల్లలు ప్రతిరోజూ పాలు తాగడం వల్ల కలిగే ప్రయోజనాలు గురించి అవగాహన కల్పించారు. అనంతరం పిల్లలకి క్యారీ బ్యాగ్స్, బిస్కెట్లు పంపిణీ చేశారు. పాల ప్రాముఖ్యత, రోజువారీ జీవితంలో పాలు సేవిం చడం వలన ఉపయోగాలు,తలసరి పాల లభ్యత గురించి వివరించారు. కార్యక్ర మంలో శ్రీజ కంపెనీ నిర్వాహకులు పిబ్ అధికారి శంకర్, ల్యాబ్ ఇన్‌ఛార్జి మనోజ్ కుమార్‌రెడ్డి, అసిస్టెంట్ మంజునాథ్, నాణ్యత విభాగం అమిత్‌రెడ్డి, కురబలకోట ఏరియా మేనేజర్ కృష్ణప్ప, వాల్మీకిపురం నారాయణరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆ..వేదన లఘుచిత్రం చిత్రీకరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వయోభారంతో ఉండే వయో వృద్ధులకు ఆదరణ కొరవడితే కలిగే ఆవేదన ఇతివృత్తంగా తెరకెక్కుతున్న లఘు చిత్రం ఆ..వేదన అని చిత్ర నిర్మాత ధనలక్ష్మి తెలిపారు. ప్రస్తుతం మదనపల్లిలో ఆ..వేదన చిత్రం చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రంలో పుర ప్రజలకు సువరిచితులైన ప్రముఖులే నటీనటులుగా తెరకెక్కుతోంది. లఘు చిత్రాలు నిర్మాణంలో అనుభవం గడించిన దర్శకులు ఎం.రాజేంద్ర, కె.రాజల పర్యవేక్షణలో ఆ..వేదన లఘుచిత్ర నిర్మాణం మదనపల్లిలో జరుగుతోంది. సీనియర్ సిటీజన్లకు అండగా నిలుస్తూ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.ముని గోపాలకృష్ణ, ఆయన సతీమణి ధనలక్ష్మి నిర్మాతగా లఘుచిత్రాలు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వారు కూడా ఈ చిత్రంలో నటిస్తూ ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంటున్నారు.


ఆవేదన లఘు చిత్ర వివరాలు వెల్లడిస్తున్న దర్శక, నిర్మాతలు

పశువైద్య విద్యార్థులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-రాయచోటి

ఎంబిబిఎస్ విద్యార్థులతో సమానంగా పశు వైద్య విద్యార్థులకు గౌరవ వేతనం చెల్లించే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న దీక్షలు విరమింప చేసే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని శుక్రవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి రాయచోటిలో పిడిఎస్‌యు నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో పశు వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు అందరూ 40 రోజుల నుంచి నిరాహార దీక్ష చేపడుతున్నారు. రాష్ట్రంలో కడప జిల్లా ప్రొద్దుటూరు, కృష్ణాజిల్లా గన్నవరం, తిరుపతి, విజయనగరంలో గరివిడి కళాశాలలుఉన్నాయి. ఒక్కొక్క కళాశాలలో 400 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థులకు ప్రతినెలా గౌరవ వేతనం 2013 వరకు రూ.ఐదు వేలు ఇచ్చేవారన్నారు. 2013 సంవత్సరంలో ఆ గౌరవ వేతనం సరిపోవట్లేదని విద్యార్థులు అందరూ ఐక్యంగా పోరాటం కొనసాగిస్తున్న సందర్భంలో ప్రభుత్వం స్పందించి రూ.ఏడు వేలు ఇస్తామని హామీ ఇచ్చిందని చెప్పారు. ఎంబిబిఎస్, ఆయుష్, బిడిఎస్ వారికి మాత్రం రూ.25 వేలుగౌరవ వేతనం ఇస్తున్నారన్నారు. వైద్య వృత్తి చేస్తున్న వారిలో అసమానతలు చూపకుండా సమానంగా చూసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓమ్మడి జిల్లా నాయకులు రవీంద్ర, మహేష్, చిన్నారెడ్డి పాల్గొన్నారు.

బాలభటులు ప్రపంచ స్థాయి పౌరులుగా ఎదగాలి

ప్రజాశక్తి-రాయచోటి

స్కౌట్స్ అండ్ గైడ్స్(బాలభటులు) విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని ప్రపంచస్థాయి పౌరులుగా ఎదగాలని జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి కోరారు. గాలివీడు రోడ్డు మార్గాన ఉన్న అర్చన కళాశాలలో ఈ నెల 10వ తేదీ నుంచి 14వ తేదీ వరకు 5 రోజులపాటు నిర్వహించిన పెట్రోల్ లీడర్స్ శిక్షణ ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఎంపికైన 36 పిఎం శ్రీ పాఠశాలల నుండి వచ్చిన 272 మంది విద్యార్థులకు స్కౌటిజం పై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. పకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఏ విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి, నైతిక విలువలు, మానవతా విలువలు, దేశభక్తి, సేవా భావం వంటి అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. రోడ్డు ప్రమాదాల జరిగినప్పుడు ప్రథమ చికిత్స అందించి సమీపంలోని ఆసుపత్రికి చేర్చడం, గ్రామాల్లో జరిగే వివిధ కార్యక్రమాల సమయంలో స్వఛ్ఛందంగా సేవలందించడం, మంచి అలవాట్ల గురించి నేర్పించడం జరిగిందన్నారు.కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఏఎస్‌ఒసి లక్ష్మీకర్, హెచ్‌డబ్ల్యుబి నిర్మల, స్కౌట్ మాస్టర్‌లు మార్ల ఓబుల్‌రెడ్డి, నాగరాజ, గైడ్ కెప్టెన్లు సుజాత, గోవిందమ్మ, స్వర్ణలత, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసు, టీచర్, సైన్యం ఉద్యోగాలు మినహా

ప్రభుత్వ ఉద్యోగాలు లేవు

- వ్యవసాయ అభివృద్ధి, ప్రభుత్వ ఉద్యోగాలు లేకుండా దేశాభివృద్ధి అసాధ్యం
- సెల్ ఫోన్, సినిమాలు యువతను తప్పదోవ పట్టిస్తున్నాయి
- నిరుద్యోగ వ్యతిరేక సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్


మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్

ప్రజాశక్తి - కడప అర్బన్

దేశంలో పోలీసు, టీచర్, సైన్యం ఉద్యోగాలు మినహా ప్రభుత్వ ఉద్యోగాలు లేవని, మోడీ మేకింగ్ ఇన్ ఇండియా- 2017 అమలు శూన్యమని, వ్యవసాయ అభివృద్ధి, ప్రభుత్వ ఉద్యోగాలు లేకుండా దేశాభివృద్ధి అసాధ్యం సెల్లు, సినిమాలపై నియంత్రణ లేకపోవడంతో యువతను తప్పుదోవ పట్టిస్తున్నాయి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్ అన్నారు. శుక్రవారం కడపలోని యుటిఎఫ్ మీటింగ్ హాల్‌లో సిపిఎం నగర కార్యదర్శి రామ్మోహన్ అధ్యక్షతన 'నిరుద్యోగ వ్యతిరేక సదస్సు' నిర్వహించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని ప్రభుత్వ శాఖలలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, డైలీ వేజ్ ఉద్యోగాలు మాత్రమే ఇస్తున్నారని, పర్మినెంట్ ఉద్యోగాలు కనుమరుగు చేశారని విమర్శించారు. 2017 నుంచి మేక్ ఇన్ ఇండియా అమలు చేస్తానని, 2014 ఎన్నికల ముందు దేశవ్యాప్తంగా జరిగిన బహిరంగ సభల్లో ప్రజలకు మోడీ హామీ ఇచ్చారని, ఆ హామీ ఏమైందని ప్రశ్నించారు. 2019 ఎన్నికల ముందు మేక్ ఇన్ ఇండియా నినాదం ఇచ్చి మరొకసారి దేశ యువతను మభ్య పెట్టారని, ఆచరణలో అది బూటకమని తేలిందని వాపోయారు. 2024 ఎన్నికల్లో నరేంద్ర మోడీ పూర్వకపు మాటలు నీటి మూటలని తెలుసుకున్న యువత బిజెపికి ఉన్న 303 ఎంపీ సీట్ల నుంచి 240 సీట్లకు తగ్గించారని తెలిపారు. దేశ ప్రజలు యువత వాస్తవ పరిస్థితుల నుంచి నిర్ణయాలు తీసు కుంటారు తప్ప, భ్రమలు, దీర్ఘకాలం ప్రజలను ప్రభావితం చేయలేవని పేర్కొన్నారు. నేడు సెల్ ఫోన్లు ప్రతిరోజు ప్రతి యువకుడు, యువతి 2018 సార్లు టచ్ చేస్తున్నారని ఒక సర్వేలో తేలిందని, ఇది యువత మానసిక శక్తిని బలహీన పరుస్తూ ఆందోళన గురి చేస్తోందని పేర్కొన్నారు. ఈవిషయం మానసిక శాస్త్రవేత్తలు తెలియజేస్తున్న నేటి యువతలో అవగాహన కలిగించడంలో ప్రభుత్వాలు విఫలం చెందాయన్నారు. సినిమాలు అశ్లీల ఇంటర్నెట్ యువతను తప్పుదారి పట్టిస్తున్నాయని సందేశాత్మకమైన సినిమాలు సెన్సార్ బోర్డు విస్మరించిందని చెప్పారు. సదస్సులో సిపిఎం కడప జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, జిల్లా సీనియర్ నాయకులు సుబ్బమ్మ, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాసులురెడ్డి, డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిన్ని, శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాహుల్, రవి, సిపిఎం ఒంటిమిట్ట, సిద్ధవటం మండల కార్యదర్శులు నరసయ్య, సురేష్ బాబు ప్రసంగించారు. సదస్సులో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఐద్వా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏప్రిల్ 3 నుంచి శ్రీపట్టాభిరామస్వామి బ్రహ్మోత్సవాలు


శ్రీపట్టాభిరామస్వామి దేవాలయం

- 2న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ
- 8న సీతారాముల కల్యాణోత్సవం
- 9న రథోత్సవం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వాల్మీకిపురం పట్టణ నడిబొడ్డున వెలసి వెయ్యేళ్ల చరిత్ర కలిగిన శ్రీ పట్టాభిరామస్వామి బ్రహ్మోత్సవాలను ఏప్రిల్ 2వ తేదీ నుంచి 11వ తేది వరకు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం తిరుమలలో టిటిడి అధికారులు పోస్టర్లను ఆవిష్కరించారు. ఏప్రిల్ 2న అంకురార్పణతో ప్రారంభమై 11న ముగుస్తాయి. 3వ తేదీ గురువారం ఉదయం ధ్వజారోహణం, రాత్రి గజవాహనం, 4వ తేదీ శుక్రవారం ఉదయం ముత్యపుపందిరి వాహనం, రాత్రి హనుమంత వాహనం, 5వ తేదీ శనివారం కల్పవృక్ష వాహనం, రాత్రి సింహ వాహనం, 6వ తేదీ ఆదివారం ఉదయం సర్వభూపాల వాహనం, రాత్రి పెద్దశేష వాహనం, 7వ తేదీ సోమవారం ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం, మోహినీ అవతారం, 8వ తేదీ మంగళవారం ఉదయం తిరుచ్చి ఉత్సవం, రాత్రి 8 గంటల నుంచి కల్యాణోత్సవం, 11 గంటల నుంచి గరుడ వాహనం, 9వ తేదీ బుధవారం ఉదయం రథోత్సవం, రాత్రి ధూళి ఉత్సవం, 10వ తేదీ గురువారం ఉదయం తిరుచ్చి ఉత్సవం, రాత్రి అశ్వవాహనం (పార్వేట ఉత్సవం), 11వ తేదీ శుక్రవారం ఉదయం వసంతోత్సవం, మధ్యాహ్నం చక్రస్నానం, రాత్రి హంస వాహనం, ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. 12వ తేదీ రాత్రి పుష్పయాగం ఘనంగా నిర్వహిస్తారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలుగా మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కుటుంబీకులు వ్యవహరించేవారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉన్న శ్రీ పట్టాభిరామాలయాన్ని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చొరవతో 1997 ఫిబ్రవరి 23న తిరుమల తిరుపతి దేవస్థానమునకు అనుబంధ దేవాలయంగా చేర్చారు. ఆనాటి నుంచి నేటి వరకు టిటిడి ఆధ్వర్యంలో ప్రతి ఏటా శ్రీ పట్టాభిరామ స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

విద్యను రాజకీయం చేసిన ఘనత జగన్‌దే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యను రాజకీయం చేసిన ఘనత మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని టిడిపి రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ విమర్శించారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లించ లేదని వైసిపి యువత పోరుబాట నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వాస్తవానికి గత వైసిపి పాలనలో ఫీజురీయింబర్స్‌మెంట్ రూ.4500 కోట్లు బకాయి ఉందని, ఆ బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించి విద్యార్థులకు న్యాయం చేస్తోందన్నారు. జగన్ అవలంభించిన విధానాలతో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం, మానవవనరుల శాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో విద్యావ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. ఇంటర్మీడియట్ విద్యలో మార్పులు శ్రీకారం చుట్టేందుకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి గణితం-1, 2 పేపర్లను ఒకే సబ్జెక్టుగా, బోటనీ, జువాలజీని ఒకే సబ్జెక్టుగా విధివిధానాలు తయారు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం అప్పటి సిఎం జగన్ ఫోటోను పాఠశాల బ్యాగులపై ముద్రించేందుకు రూ.1200 కోట్లు ప్రజాధనం దుర్వినియోగం చేశారన్నారు. తిరిగి తొలగించేందుకు అదనపు భారం పడుతోందన్నారు. కూటమి సర్కార్ సూపర్ సిక్స్ పథకాలను చిత్తశుద్ధితో అమలు చేస్తోందన్నారు. మే, జూన్ మాసాలలో తల్లికి వందనం పథకంతో పాటు రైతుల కోసం అన్నదాత సుఖీభవను అమలు చేస్తామని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారన్నారు. జగన్ విధానాలతో ఎపి ఆర్థికంగా పూర్తిగా వెనుకబడిపోయిందని, ప్రస్తుతం చంద్రబాబు నాయుడు తన అనుభవంతో రాష్ట్ర పరిస్థితిని చక్కదిద్దేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. సమావేశంలో మైనార్టీ సెల్ నాయకులు అన్వర్ బాషా పాల్గొన్నారు.

పేదలకు రంజాన్ తోఫా

ప్రజాశక్తి-పీలేరు

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పీలేరు పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది పి.షౌకత్ అలీ, రియల్టర్ ఇబ్రహీం సంయుక్తంగా పేద కార్మికులకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. శుక్రవారం స్థానిక సదుం రోడ్డులోని న్యాయవాది కార్యాలయంలో తమ ప్రాంతంలో విధులు నిర్వహించే గ్రామ పంచాయతీ కార్మికులు, దోబీలు, క్షవర శాలల నిర్వహకులు, ఇతర పేదలకు నిత్యావసర సరుకులైన గోధుమపిండి, చక్కెర, కందిపప్పు, సేమియాలు, నూనె, తదితర వస్తువులు నింపిన కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ తమకున్నంతలో కొంత పేదలకు పంచాలని పవిత్ర రంజాన్ మాసం బోధించిన ధర్మమని పేర్కొన్నారు. దాన్ని అనుసరించి తాము తమ వంతు సాయాన్ని అందిస్తుంటామన్నారు.


పేదలకు రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న న్యాయవాది


కార్ల్ మార్క్స్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బాస్ నేతలు

ప్రపంచ గతిని మార్చిన విప్లవ యోధుడు కార్ల్‌మార్క్స్

ప్రజాశక్తి-మదనపల్లె

తలకిందులుగా ఉన్న తత్వశాస్త్రాన్ని నిటారుగా నిలిపి, సామాజిక, ఆర్థిక, రాజకీయ విప్లవాలకు బాటను ఏర్పరిచి, ప్రపంచ గతిని మార్చిన విప్లవ యోధుడు కార్ల్ మార్క్స్ అని ఆయన వర్ధంతి కార్యక్రమంలో బాస్ వ్యవస్థాపకుడు పిటిఎం శివప్రసాద్ స్పష్టం చేశారు. సోషలిస్టు విప్లవయోధుడు కార్ల్ మార్క్స్ వర్ధంతిని, శుక్రవారం స్థానిక బాస్ కార్యాలయం నందు నిర్వహించారు. ఈ సందర్భంగా బాస్ ప్రతినిధులు కార్ల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం బాస్ వ్యవస్థాపకుడు శివప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత జర్మనీలోని ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన మార్క్స్, రాజకీయ ఆర్థిక శాస్త్రం, హెగెలియన్ తత్త్వశాస్త్రం చదువుకున్నారని చెప్పారు. యుక్త వయసులో ఏ దేశపు పౌరసత్వమూ లేని స్థితిలో, లండన్‌లో జీవితం గడిపారన్నారు. లండన్ లో మరో జర్మన్ ఆలోచనా పరుడైన ఫెడెరిక్ ఏంగెల్స్ తో కలిసి తన చింతనను అభివృద్ధి చేసుకుంటూ పలు పుస్తకాలు ప్రచురించాడని తెలిపారు. 1848 నాటి కరపత్రమైన కమ్యూనిస్ట్ మేనిఫెస్టో వాటన్నింటిలో సుప్రసిద్ధమైనదని, తదుపరి కాలపు మేధో, ఆర్థిక, రాజకీయ చరిత్రను ఈ కమ్యూనిస్ట్ మేనిఫెస్టో ఎంతో ప్రభావితం చేసిందని చెప్పారు. జర్మన్ శాస్త్రవేత్తగా, తత్త్వవేత్తగా, సామాజిక వేత్తగా, పాత్రికేయుడిగా, సోషలిస్టు విప్లవ కారుడిగా కార్ల్ మార్క్స్ ప్రపంచానికి చిరస్మరణీయ సేవలు అందించారని కొనియాడారు. నేటి యువత ఆయన పుస్తకాలను అధ్యయనం చేసి, ఆయన స్ఫూర్తితో సమాజ మార్పుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బాస్ జిల్లా కన్వీనర్ ముత్యాల మోహన్, కోశాధికారి నీరుగట్టి రమణ తోపాటు బాస్ నాయకులు మీసాల గంగులు, క్రాంతి, ఎస్.లక్ష్మీనారాయణ, వై.గంగాధర్, బి.నరసింహులు, ప్రశాంత్, శరత్, అభి పాల్గొన్నారు.

కుక్క తెచ్చిన తంటా

- యజమానురాలిపై విచక్షణారహితంగా దాడి

ప్రజాశక్తి - వాల్మీకిపురం : పొలానికి వేసిన వైర్లను కుక్క కొరికివేస్తున్న నేపథ్యంలో చోటు చేసుకున్న వాదోపవాదనల్లో యజమానురాలిపై ఇద్దరు వ్యక్తులు విచక్షణారహితంగా దాడి చేశారు. బాధితురాలు కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలం, ఎల్లుట్ల పంచాయతీ శీలంవారిపల్లికి చెందిన వెంకటరమణ భార్య అలివేలమ్మ ఓ కుక్కను పెంచుకుంటున్నారు. అదే గ్రామానికి చెందిన సుధాకర్, బాలకృష్ణలు తమ పొలానికి వేసుకున్న కంచెను కుక్క కొరికివేస్తోంది. ఇదే విషయమై మాట్లాడుతుండగా మాటామాటా పెరగడంతో అలివేలమ్మపై నిందితులిద్దరూ దాడికి పాల్పడ్డారు. కాలితో తన్నుతూ చిత్రహింసలకు గురిచేశారు. అత్యాచారానికి యత్నించారని బాధితురాలు ఆరోపించారు. బాధితురాలు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై గుర్రంకొండ ఎస్ఐ మధురామచంద్రుడును వివరణ కోరగా..మహిళపై జరిగిన సంఘటన వాస్తవమేనని, ఈ మేరకు సుధాకర్, బాలకృష్ణలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



మంత్రి మండిపల్లిని గజమాలతో సన్మానిస్తున్న ప్రవీణ్‌కుమార్

క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వడం హర్షణీయం

ప్రజాశక్తి-చిన్నమండెం

మండలంలోని బోరెడ్డిగారిపల్లెలోని రాష్ట్ర రవాణా క్రీడ యువజన శాఖ మంత్రి మండి పల్లి రాంప్రసాద్‌రెడ్డిని శుక్రవారం శాప్ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రీడలకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాకారులకు క్రీడా పరికరాలు కొనుగోలు చేసేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహించిందని అన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యతను పెంచేలా తమ వంతు కృషి చేస్తామని ప్రవీణ్ తెలిపారు.

నేడు పశువుల సంత వేలంపాట

ప్రజాశక్తి-రామాపురం

మండల కేంద్రంలో 2025-2026 ఆర్థిక సంవత్సరంలో పశువుల సంతతో పాటు గేటు వేలం శనివారం సాయంత్రం 3 గంటలకు సంత నిర్వహించే ప్రదేశంలో బహిరంగ వేలంపాట నల్లగుట్టపల్లి సర్పంచ్ అయోధ్యపురం నాగభూషణ్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు గ్రామ కార్యదర్శి నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. పాటలో పాల్గొనదలచిన వారు గ్రామపంచాయతీ లో ఎలాంటి రుణం ఉండరాదని తెలిపారు. పశువుల సంత పాటలో పాల్గొనే వారు రూ.2.50లు, గేటు వేలంలో పాల్గొనేవారు రూ.50 వేలు సాల్వెన్సీ సర్టిఫికెట్ తీసుకురావాన్నారు. పశువుల సంత వేలం పాట దారుడు రూ.50వేలు, గేటు వేలం పాట దారుడు రూ.30వేలు ధారావత చెల్లించాలన్నారు. పాటలో పాట నిలిపిన వెంటనే పాడిన మొత్తం అక్కడే చెల్లించాలని, అటు చెల్లించని యెడల ధారావతు వెనక్కి ఇవ్వబడదని, వేలంతో ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండా రద్దు చేసుకునే అధికారం గ్రామపంచాయతీకి ఉంటుందని అన్నారు. పాటదారుడు స్టాంపు డ్యూటీ చట్టం ప్రకారం 5 శాతం స్టాంపు డ్యూటీ చెల్లించి అగ్రిమెంటు చేసుకోవాలని తెలిపారు.

ఉరుసులో తాగునీరు సరఫరా

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని నీలకంఠరావుపేట దర్బార్‌నగర్‌లో జరుగుతున్న ఉరుసు ఉత్సవానికి మైనార్టీ నాయకుడు అయూబ్ ట్యాంకర్‌తో తాగునీటిని సరఫరా చేశారు. మూడు రోజులపాటు సాగిన ఉరుసుకు వచ్చిన ప్రజలకు తాగు నీరు సరఫరా చేశారు. ఎండల అధికంగా ఉన్న సమయంలో తాగునీటికి ఇబ్బంది పడకుండా తాగునీరు అందించడం పట్ల ప్రజలు అయూబ్‌ను అభినందించారు.

ఘనంగా ముగిసిన మల్లూరమ్మ జాతర

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల పరిధిలోని మల్లూరు గ్రామంలో గురు, శుక్రవారాలలో జరిగినటువంటి మల్లూరమ్మ వారి జాతర ప్రశాంతంగా ముగిసింది. జాతరకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. జాతరలో ఏర్పాటు చేసినటువంటి జబర్దస్త్, నెల్లూరు మాధవ్ ఈవెంట్స్ వారి డిజె, కోలాటం మొదలగు నృత్యాలు జాతరకు వచ్చిన ప్రజలకు ఆనందాన్నిచ్చాయి. భక్తులు చాందిని బండ్లు కట్టి అమ్మవారికి తమ మొక్కులు తీర్చుకుని బోనాలు సమర్పించుకున్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి -కలకడ

ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ మలంగ్ షావలి తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ మలంగ్ షావలి తెలిపారు. 2025-26 సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్‌లో చేరే విద్యార్థులు 10వ తరగతి ప్రస్తుతం చదువుతూ పరీక్షలు రాసేవారు అర్హులని ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో రిజర్వేషన్ల ప్రాతిపదికన అడ్మిషన్లు చేసుకోవడం జరుగుతుందని తెలిపారు.

ఉచిత కుట్టు మిషన్ శిక్షణకు..

తంబళ్లపల్లి : ఉచిత కుట్టు మిషన్ శిక్షణ పొందేందుకు ఆసక్తిగల మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసి, ఎస్‌సి, ఎస్‌టి తదితర వర్గాలకు చెందిన 18 నుంచి 50 ఏళ్ల మధ్య వయసుగల మహిళలు అర్హులన్నారు. తెల్ల రేషన్ కార్డుదారులై ఉండాలన్నారు. ఈ శిక్షణ వ్యవధి 45 రోజులు అయితే రోజుకు 8 గంటలు శిక్షణ, 60 రోజులు అయితే రోజుకు 6 గంటలు శిక్షణ, 90 రోజులు అయితే రోజుకు 4 గంటలు శిక్షణ ఉంటుందన్నారు. అర్హులై ఆసక్తి కలిగిన మహిళలు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం తీసుకొని సంబంధిత సచివాలయంలో ఈనెల 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకుని 75శాతం హాజరు ఉన్న లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా కుట్టు మిషన్ అందజేస్తుందని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా సతీశ్‌రెడ్డి

ప్రజాశక్తి-రామసముద్రం :కాంగ్రెస్ పార్టీ రామసముద్రం మం డలం అధ్యక్షులుగా కెసిపల్లికి చెందిన సిఆర్ సతీశ్‌రెడ్డి నియమి తులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు షర్మిలరెడ్డి నుంచి ఉత్తర్వులు అందాయి. ఆయనకు డిసిసి అధ్యక్షులు గాజుల భాస్కర్ అభినందనలు తెలిపారు. సతీశ్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ నాయకులు మల్లెల పవన్‌కుమార్‌రెడ్డి సహకారంతో మండ లంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు.



వరిగ సర్పంచ్ సుబ్బలక్ష్మమ్మ మృతి

ప్రజాశక్తి-రాయచోటి: మండలంలోని వరిగపాపిరెడ్డిగారిపల్లె గ్రామ సర్పంచ్ కసిరెడ్డి సుబ్బులక్ష్మమ్మ శుక్రవారం మృతి చెందారు.ఆమె అంత్య క్రియలు శనివారం శెట్టివాండ్లపల్లె లో ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆమె కుమారుడుకౌన్సిలర్ కసిరెడ్డి వెంకట నరసింహారెడ్డి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా ఆమె మృతదేహానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్లాస్టిక్‌తో ప్రాణాలకు ముప్పు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి ఆరోగ్యాన్ని కాపాడుకుందామని లేకుంటే ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమా దం ఉందని నగర పంచాయతీ కమిషనర్ జీవి పల్లవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె మాట్లాడుతూ పర్యావరణం, అడవులు, సైన్స్ అండ్ టెక్నాలజీ సెక్షన్-1 విభాగం జిఒఎంఎస్ నెం.81 జిఒ ప్రకారం పర్యావరణం, అటవీ వాతా వరణ మార్పుల మత్రిత్వ శాఖ కేంద్ర ప్రభుత్వం గుర్తించిన సింగల్ యూస్ ప్లాస్టిక్‌ను నిషేదిస్తూ ప్లాస్టిక్ వ్యర్ధల నిర్వహణ సదరు రూల్స్ 2021ని నోటిపై చేసిందన్నారు. మన నిత్య జీవితంలో సింగల్ యూజ్ ప్లాస్టిక్‌ను నియంత్రించి రాబోవు తరాలకు నివాస యోగ్యమైన పరిసరాలను అందిం చడం మన అందరి బాధ్యత అన్నారు. ప్లాస్టిక్ వాడకం వలన అనేక కేన్సర్, ఇతర వ్యాధుల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. ప్లాస్టిక్ పర్యావరణాన్ని కలుషితం చేస్తుందని చెప్పారు. ఇలాంటి మహమ్మారి ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టి మన భూమిని, పర్యావణాన్ని మన ఆరోగ్యాన్ని కాపాడు కుందామని పిలుపునిచ్చారు. బి.కొత్తకోట పుర ప్రజలందరికీ ప్లాస్టిక్ వాడ కాన్ని మానివేసి మంచి పర్యావరణాన్ని, ఆరోగ్యాన్ని మన బావితరాలకు అందిద్దామని చెప్పారు. 2024-2025వ ఏడాదికి సంబం దించిన ఇంటి పన్ను, నీటిపన్ను, ఖాళీ జాగా పన్ను, డిఅండ్ఒ ట్రేడ్ లైసెన్స్ చెల్లించి పట్టాణాభివృద్ధికి తోడ్పడాలని ప్రజలని ఆమె కోరారు.



మాట్లాడుతున్న నగర పంచాయతీ కమిషనర్ జి.వి పల్లవి

సిఐని సన్మానించిన టూవీలర్ అసోసియేషన్ నాయకులు

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడ సిఐ గురునాథను నవ్యాంధ్ర టూవీలర్ వెల్ఫేర్ అసోసియేషన్ యూనియన్ నాయకులు ఘనంగా సన్మానించారు. మండల కేంద్రమైన కలకడలో ఏర్పాటు చేయబడిన నవభారత టూవీలర్ యూనియన్ అధ్యక్షులు మహమ్మద్‌రఫీ కార్యదర్శి ముయున్‌లా ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు సిఐని పూలమాలలు, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులతో సిఐ మాట్లాడుతూ మీకు ఉన్న సమస్యల పట్ల నేను పరిష్కరించడానికి ముందుంటానని మీ పని వృత్తిలో ఎలాంటి వడిదుడుకులు లేకుండా నిజాయితీగా పని చేయాలని సూచించినట్లు తెలిపారు ఎవరైనా ద్విచక్ర వాహనాలను మీ వద్దకు తెచ్చి అమ్ముతాము అని చెప్పిన యెడల వారిని మా వద్దకు తీసుకువచ్చి వివరాలు తెలిపినచో వారికి న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని ఇందుకోసం మీరు మాకు సహకరించాలని తెలిపామన్నారు ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రియాజ్ భాషా, హసన్‌బాషా, ఇమామ్ హుస్సేన్, సద్దాం పాల్గొన్నారు.



సిఐ గురునాథను సన్మానిస్తున్న టూవీలర్ అసోసియేషన్ నాయకులు

జాతరను శాంతియుతంగా జరుపుకోవాలి

- పీస్ కమిటీ సమావేశంలో డిఎస్‌పి



పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి కొండయ్య నాయుడు

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల కేంద్రంలోని స్థానిక పోలీసుస్టేషన్‌లో శుక్రవారం హిందూ, ముస్లిము పెద్దలతో పోలీసు అధికారులు సమావేశం నిర్వహించారు. డిఎస్‌పి కొండయ్య నాయుడు, సిఐ వరప్రసాద్, ఎస్‌ఐ సుధాకర ఆధ్వర్యంలో సమావేశము ఏర్పాటు చేశారు. ఈనెల 16, 17వ తేదీలలో కేసాపురంలో జరిగే పాలేటమ్మ జాతరను ప్రశాంతంగా జరుపుకోవాలని, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వాహనాలను పార్కింగ్‌కు కేటాయించిన స్థలంలోనే పార్కింగ్ చేసుకోవాలని సూచించారు. జాతర శాంతియుతంగా జరుగుటకు గాను ప్రజలు సహకరించాలని పోలీసు అధికారులు తెలిపారు. మత సామరస్యానికి ప్రతీకగా ప్రతి ఒక్కరు నడుచుకోవాలని సూచించారు.

ఘనంగా హోలీ సంబరాలు

ప్రజాశక్తి-నందలూరు

నందలూరు రైల్వే కేంద్రంలో రైల్వే కార్మికులు శుక్రవారం ఉదయం ఆనందోత్సాహాలతో హోలీ సంబరాలు నిర్వహించుకున్నారు. ఒకరి కొకరు రంగులు చల్లు కుంటూ నృత్యాలు చేస్తూ ఉత్సా హంగా పండుగ చేసుకున్నారు. ముఖ్యం గా ఉత్తర భారతదేశానికి చెందిన ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్ కార్మికులు ఈ వేడుకలు నిర్వహించుకున్నారు. మహిళలు ఉదయాన్నే లేచి వివిధ రకాల పిండి వంటలు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి పండుగ చేసుకున్నారు. **మదనపల్లె అర్బన్ :** పట్టణంలోని అమ్మచెరువుమిట్ట వద్ద గల వెలుగు ప్రత్యేక పాఠశాల, వృద్ధాశ్రమం నందు వెలుగు కన్వీనర్ ఆర్.భాగ్యలక్ష్మి ఆధ్వ ర్యంలో హోలీ పండుగను చిన్నారులు, వృద్ధులు రంగులు చల్లుకుంటూ, కేరింతల నడుమ ఆటపాటలతో ఎంతో ఉత్సా హంగా జరుపు కున్నారు. కార్యక్రమంలో వెలుగు కన్వీనర్ భాగ్య లక్ష్మీ, ఇసి మెంబెర్ యం.సుజాత, ప్రిన్సిపల్ లీనా కుమారి, సోషల్ వర్కర్ యం.గీత, వార్డెన్ యం.స్వీటీ, చిన్నారులు, వృద్ధులు, సిబ్బంది పాల్గొన్నారు. **పీలేరు:** పట్టణంలోని మార్వాడీ, బిహారీ, రాజ స్థానీ, బెంగాలీ, అస్సామీ కార్మికులు ఒకరికి ఒకరు రంగులు పూసు కుంటూ, నృత్యాలు చేస్తూ పట్టణంలో అలరించారు. ఒకరిపై ఇంకొకరు రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహలతో పట్టణంలోని రహదారుల వెంబడి తిరుగుతూ పండుగ సంబరాలు చేసుకున్నారు. యువత, చిన్నారులు ఉత్సాహంగా గడిపారు.



హోలీ సంబరాల్లో యువత, చిన్నారులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఫ్యూచర్ మైండ్స్ పాఠశాలలో శుక్రవారం కరస్పాండెంట్ నందకిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర, చిన్న పిల్లల వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రాజంపేట పట్టణంలోని అరవింద్ నేత్ర ఆస్పత్రి వైద్యులు అరవింద్, చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ లలితాదేవి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన వైద్య శిబిరానికి దాదాపు 450 మంది విద్యార్థులకు 150 మంది తల్లిదండ్రులకు వైద్య పరీక్షలు నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రులకు ఆరోగ్యం పట్ల పలు సూచనలు సలహాలు అందించారు. ఈ శిబిరంలో పాల్గొన్న తల్లిదండ్రులు స్కూల్ యాజమాన్యం, ఆస్పత్రి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ముగింపు సమావేశంలో వైద్యులు మాట్లాడుతూ తల్లిదండ్రులు ఈ శిబిరంలో ఎక్కువ మంది పాల్గొనడం సంతోషకరమని, ముఖ్యంగా పెద్దలకు వయసు రీత్యా కంటి చూపు తగ్గడం సహజమని, కానీ ఇక్కడ విద్యార్థులను 450 మందిని పరీక్షిస్తే దాదాపు 30 నుంచి 40 మంది కంటి చూపులో లోపం తెలిసిందని అన్నారు. ఇది కేవలం చిన్నతనం నుంచే మొబైల్ ఫోన్ అలవాటు కావడం, ఆహారపు అలవాట్లు కారణంగానే సంభవిస్తుందని తెలిపారు. ఈ పరిస్థితిని నివారించేందుకు పిల్లల్ని క్యారమ్‌బోర్డ్, చెస్ గేమ్, చైనీస్ చక్కర్, ఫజిల్స్ మొదలగు మైండ్ గేమ్స్ మీద శ్రద్ధ పెట్టే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. కంటి చూపు తో ఇబ్బంది పడుతున్న 20 మంది విద్యార్థులకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రాజంపేటశాఖ ఉచితంగా కంటి అద్దాలు ఏప్రిల్ 5వ తేదీన అందిస్తున్నారని అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఇటువంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని సంస్థ ప్రతినిధి గంగనపల్లి వెంకటరమణ తెలిపారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు వైద్యులను ఘనంగా సన్మానించారు.

అనుమతులపై ఢిల్లీ పెద్దలు సానుకూలం : టిడిపి

ప్రజాశక్తి-కాశినాయన : మండల పరిధిలోని కాశినాయన జ్యోతి క్షేత్ర ఆలయ నిర్మా ణం పనుల అనుమతిపై ఢిల్లీ పెద్దలు సా నుకూలంగా ఉన్నా రని బద్వేల్ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి రితీష్‌కుమార్‌రెడ్డి పేర్కొ న్నారు. శుక్రవారం ఆయన జ్యోతిక్షేత్రాన్ని సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కాశీనాయన జ్యోతి క్షేత్రం మొదటి నుండి తెలు గుదేశం పార్టీ ఆధ్వర్యంలోనే అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. తన తాత మంత్రి వీరారెడ్డిగా ఉన్నప్పుడు ఇక్కడ అన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరిగా యని గుర్తుచేశారు. అనుమతులకు సంబంధించిన పైళ్లను, ఆధారాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపము ఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్ ఢిల్లీలోని పెద్దలతో మాట్లాడి అటవీశాఖ అనుమతులు తీసుకొస్తారని ధీమా వ్యక్తం చేశారు. స్థానికులు, భక్తులు ఎలాంటి అపోహలు పెట్టుకో వద్దన్నారు. అనంతరం అక్కడ తలనీలాలు తీసుకునే రూములకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఖాది, గ్రామీణ ప్రదేశాల శాఖ చైర్మన్ కె.కె. చౌదరి, టిడిపి నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు రవీంద్రారెడ్డి, రాజారెడ్డి, గురివిరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యకు ప్రమాద ఘంటికలు

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రస్తుతం అధికారుల సమా వేశాలను చూస్తే విద్యా శాఖకు ప్రమాద ఘడియలు మోగు తున్నాయని, పేద, బడుగు, బలహీనవర్గాల పిల్లలకు ప్రభుత్వ విద్య బహు దూరమయ్యే ప్రమాద ముందని ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లెక్కల జమాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు పి.వి.సుబ్బారెడ్డి అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు జమాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో జరిగే సంఘ నాయకుల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశాల్లో ఐదు రకాల బడులను ఏర్పాటు చేస్తున్నామని టీవీల్లో, పత్రికల్లో ఉదరకొడుతున్నారని చెప్పారు. కానీ క్షేత్రస్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో ఎంఇఒల సమావేశం చూస్తే పంచాయతీకి ఒక మోడల్ స్కూల్ పేరుతో ప్రాథమిక పాఠశాలలను లేకుండా చేస్తున్నారని వాపోయారు. జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ మూడవ తరగతి నుంచి సబ్జెక్టు టీచర్ల బోధనకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 7,580 సెకండ్ గ్రేట్ ఉపాధ్యాయులకు ప్రమోషన్‌లు ఇచ్చినవన్నీ సర్‌ప్లస్ అవుతాయన్నారు. సమావేశంలో దిలీప్‌కుమార్, రామలక్ష్మి రెడ్డి, పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని విద్యుత్ రిటైర్డ్ ఉద్యోగుల విశ్రాంతి భవనంలో శారీరక వికలాంగుల ఉద్యోగ సంక్షేమ సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు అన్నం చిన్న సుబ్బయ్య యాదవ్ హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షులుగా పులిమి జేమ్స్, ప్రధాన కార్యదర్శిగా చిన్నకొట్ల చంద్ర, కోశాధికారిగా బత్తల చంద్రశేఖర్, గౌరవ అధక్షులుగా బి.సుధాకర్, సమాచార కార్యదర్శిగా పి.సుబ్బరాజు, కార్యదర్శులుగా వై.గుర్రప్ప, హెచ్.నరసింహులు, కన్వీనర్‌గా ఎం. రవి శంకర్ రెడ్డి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు ఎల్లయ్య, శారీరక దివ్యంగా ఉద్యోగులు పాల్గొన్నారు.



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న డిఆర్ఒ మధుసూదన్‌రావు

క్రీడలతో మానసిక ఉల్లాసం : డిఆర్ఒ

ప్రజాశక్తి-రాయచోటి: క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని డిఆర్ఒ కెమధుసూదన్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం డాక్టర్ బిఎస్‌రావు మెమోరియల్ జోనల్ స్పోర్ట్స్ మీట్‌ను పట్టణంలోని శ్రీ చైతన్య ఇంటర్‌నేషనల్ బోర్డింగ్ స్కూల్ ఆటస్థల మైదానంలో ప్రారంభమైన ఆటలపోటీలను ఎయస్‌పిఎం వెంకటాద్రితో బాటు శ్రీ చైతన్య కడప డివిజన్ ఎజిఎండి రమణయ్య, ఆర్ఐ మహబూబ్‌బాషాతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి అనంతరం స్పోర్ట్స్ టార్చ్ వెలిగించి ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ విద్యార్థులలో క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకు డాక్టర్ బి.ఎస్.రావు జ్ఞాపకార్థంగా వాలి బాల్, బాస్కెట్ బాల్, సెటిల్, రన్నింగ్ తదితర క్రీడలను ఏర్పాటు చేసిన చైతన్య స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు.కేవలం విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా క్రీడల్లో పాల్గొనడంవల్ల మానసిక ఉల్లసానికి, శారీరక దారఢ్యానికి దోహదపడ తాయన్నారు. తమ పిల్లలందరూ శ్రీ చైతన్య విద్యార్థులేనని వ్యక్తిగతంగా తనకు శ్రీ చైతన్య విద్యాసంస్థలపట్ల అపార మైన గౌరవం ఉందన్నారు. ఎఎస్‌పి వెంకటాద్రి మాట్లాడుతూ ప్రస్తుతం విద్యాసంస్థలు పిల్లలకు చదువుతప్ప ఇతరత్రా నేర్పించ రనన్నారు.ప్రభుత్వం ప్రవేశ పెట్టిన శక్తి టీంలను రాయచోటి శ్రీ చైతన్య స్కూల్లో కూడా ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం అతిధులను ఆర్ఐ మహబూబ్‌బాషా సన్మానించారు. ఆటల్లో గెలుపొందిన విజేతలకు ఎజియం డి.రమణయ్య చేతులమీదుగా అవార్డులతో పాటు షీల్డ్‌లు మొమెంటో లను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ కళాభారతి, సుధాకర్ రెడ్డి, శివార్జునరెడ్డి, సుబ్బయ్య, సుబ్బోజి, నాగనరేంద్ర, రాధిక, కోఆర్డినేటర్ కుటుంబరావు వైస్ ప్రిన్సిపల్ జీవా నందం, డీన్లు, ఇన్‌ఛార్జిలతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల పౌర్ణమి కల్యాణం

ప్రజాశక్తి - ఒంటిమిట్ట : శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో వైభవంగా సీతారాముల పౌర్ణమి కల్యాణాన్ని టిటిడి సిబ్బంది, ఆలయ అర్చకులు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా సంకల్పం చేసి తర్వాత రక్షాబంధన్ యజ్ఞోపవీతధారణ చేశారు. మహాసంకల్పం తర్వాత కన్యాదానం కార్యక్రమం నిర్వహించి ఉభయ దారులు ఇచ్చినటువంటి పట్టు వస్త్రాలను స్వామి అమ్మవార్లకు దరింపజేసి సీతారామచంద్రుల ప్రవచనం చదివారు. అనంతరం స్వామి అమ్మవార్లకు జీలకర బెల్లం కార్యక్రమం నిర్వహించి మాంగల్య సూత్రధారణ చేశారు. కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు రాఘువాచార్యులు మనోజ్ కుమార్లు నిర్వహించారు కార్యక్రమంలో టిటిడి అధికారులు సెక్యూరి టీ సిబ్బంది పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పాఠశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : పట్టణంలోని కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలల మాజమాన్యాలు ముందస్తు అడ్మిషన్లు పాల్పడుతున్నాయని వాటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు నేతి నాగేశ్వర డిమాండ్ చేశారు. శుక్రవారం రాజంపేట పట్టణంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యా సంవత్సరం పూర్తి కాకముందే ముందస్తు అడ్మిషన్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. శుక్రవారం హోలీ పండుగ సందరేగా పాఠశాలలకు సెలవు అయినప్పటికీ అడ్మిషన్ల కోసం ఉపాధ్యాయులను వీధుల్లో తిప్పుతున్నారని పేర్కొన్నారు. వేతనాలు పెరగాలంటే అడ్మిషన్లు తప్పవని ఉపాధ్యాయులకు లక్ష్య నిర్దేశం చేసి పల్లెలు, పట్టణంలో తిరుగుతూ తల్లిదండ్రులను ప్రలోభాలకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను పూర్తిగా వ్యాపారంగా మార్చివేశాయని, అలాంటి పాఠశాలలపై జిల్లా కలెక్టర్ స్పందించి న్యాయ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకులు రామ్ చరణ్, సాదిక్, పృధ్వీ, హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్



సయ్యద్‌హుస్సేన్(ఫైల్ ఫోటో)

ప్రమాదానికి గురైనలారీ

ఘోర రోడ్డు ప్రమాదం

- ఇద్దరు డ్రైవర్లు మృతి : మరొకరికి తీవ్ర గాయాలు
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు లారీ డ్రైవర్లు మృతి చెందగా, ఓ లారీ యజమాని తీవ్రంగా గాయ పడ్డాడు. ఈ విషాదకర సంఘటన కురబలకోట మండలం తానామిట్ట వద్ద చోటుచేసుకుంది. మదనపల్లి డిఎస్‌పి కొండయ్యానాయుడు, రూరల్ సిఐ సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించి జెసిబి సాయంతో మృతదేహాలను వెలికి తీయించారు. సిఐ తెలిపిన వివరాల మేరకు.. రాయచోటి పట్టణం, పెట్రోల్ బంకు వీధిలో ఉన్న అమీర్‌బాషా కుమారుడు సయ్యద్ హుస్సేన్(27) గాలీవీడుకు చెందిన నాగేశ్వర్ రావుకు చెందిన లారీకి డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. డ్రైవర్, ఓనర్ ఇద్దరూ కలిసి గ్రానైట్ లోడ్‌తో బెంగళూరు నుంచి రాజమండ్రికి బయలుదేరారు. కర్ణాటక రాష్ట్రం ఆలేహల్లి ప్రాంతానికి చెందిన లారీ డ్రైవర్ భాస్కర్ (35) సోలార్ విడి పరికరాల లోడ్‌తో కడప నుంచి బెంగళూరుకు బయల్దేరాడు. ఈ రెండు లారీలు మార్గమధ్యంలోని కురబలకోట మండలం, ముదివేడు క్రాస్ సమీపంలోని తానామిట్ట వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘోర రోడ్డు ప్రమాదంలో రాయచోటికి చెందిన లారీ డ్రైవర్ సయ్యద్ హుస్సేన్, కర్నాటకకు చెందిన డ్రైవర్ భాస్కర్ వారి లారీల క్యాబిన్‌లో ఇరుక్కుపోయి దుర్మరణం చెందారు. లారీ ఓనర్ నాగేశ్వరరావు సైతం తీవ్రంగా గాయపడి లారీలోనే ఇరుక్కుపోవడంతో స్థానికంగా ఉన్న టోల్ గేట్ సిబ్బంది అతి కష్టం మీద బాధితుడిని వెలికి తీసి 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం తిరుపతికి రెఫర్ చేశారు. లారీ డ్రైవర్ల మృతదేహాలు క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో పోలీసులు జెసిబి సాయంతో రెండుగంటల పాటు శ్రమించి మృత దేహాలను వెలికి తీసి మదనపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ నిద్ర మత్తు, దానికి తోడు అతి వేగం కారణంగానే రెండు లారీలు ఢీకొన్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. ఈఘటనపై కేసు నమోదు చేసి మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ముదివేడు ఎస్‌ఐ దిలీప్ కుమార్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని స్తంబించిన ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

గంజాయి తరలిస్తున్న దంపతులు అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గంజాయి విక్రయిస్తున్న దంపతులను శుక్రవారం అరెస్టు చేసినట్లు రెండో పట్టణ సిఐ రామచంద్ర తెలిపారు. సిఐ కథనం మేరకు.. మదనపల్లి పట్టణం, లక్ష్మీనగర్‌కు చెందిన ఆవుల మునిరాజా, సుజాత దంపతులు గుట్టు చప్పుడు కాకుండా నిషేధిత గంజాయి వ్యాపారం నిర్వహిస్తున్నారు. పక్కా సమాచారం మేరకు ఎస్‌ఐ రహీం సిబ్బందితో స్థానిక న్యూ బైపాస్ రోడ్డులో మకాం వేశారు. దంపతులిద్దరూ అనుమానాస్పద స్థితిలో వెళుతుండగా వెంబడించి పట్టుకున్నారు. వారి వద్ద రెండు కిలోల గంజాయి పట్టుబట్టడంతో స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్లు సిఐ తెలిపారు.